సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

## క్లుప్తంగా

### శ్మశానవాటిక ఆధునికీకరణకు శంకుస్థాపన



53వ వార్డులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్యే, కార్పొరేటర్

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లోని శ్మశానవాటిక ఆధునికీకరణ పనులకు సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. రూ.1.50 కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాలమైన శ్మశానవాటికలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు ఆధునికీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. బర్నింగ్ కేంద్రం, మృతుల కుటుంబీకులు, బంధువుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్ భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు రామలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో సోమవారం సివిల్ సప్లయిస్ విభాగం ఆధ్వర్యంలో సర్కిల్–2 వారి పర్యవేక్షణలో లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు రైస్ కార్డులు అందజేశారు. కూటమి నాయకులు శ్యామలదీపిక, ఎండీ నజీర్, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు బార్ల బాలకృష్ణ, ఉమామహేశ్వర్‌రెడ్డి, గొంప ధర్మారావు, కల్యాణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా



స్వర్ణ పతకంతో బాడీబిల్డర్ ప్రవీణ్‌కుమార్

మద్రిపాలెం: ది–ఐసీఎస్ ఇండియా హైదరాబాద్ డెక్కన్ బాడీబిల్డింగ్ క్రీడల్లో విశాఖ యువకుడు సత్తా చాటాడు. హైదరాబాద్‌లో ఇటీవలే జాతీయ స్థాయిలో నిర్వహించిన బాడీబిల్డింగ్ పోటీల్లో 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన రాయి ప్రవీణ్‌కుమార్ నాలుగు కేటగిరీల్లో మూడు స్వర్ణ పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించాడు. ప్రవీణ్‌కుమార్ ఐటీఐ పూర్తి చేశాడు. తండ్రి నూకరాజు కూలి పనులు చేస్తున్నాడు. వ్యాయామంపై చిన్నతనం నుంచి ఆసక్తి పెంచుకున్న ప్రవీణ్ ఆ దిశగా శ్రమించాడు. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండటంతో దాతలు సహకరిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తానని ప్రవీణ్ అంటున్నాడు. ఇప్పటి వరకు కోచ్ పవన్ అన్ని విధాలుగా సహకారం అందించడంతోపాటు ఐసీఎస్ కాంపిటీషన్ వరకు తీసుకెళ్లారని తెలిపాడు. నాలుగు పతకాలు సాధించడంతో జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రకృతిని పరిరక్షించాలి



హిందూ శ్మశానవాటికలో మొక్కలు నాటుతున్న సంత్ నిరంకారీ మిషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల హిందూ శ్మశానవాటికలో సంత్ నిరంకారీ మిషన్ నేతృత్వంలో ప్రకృతిని పరిరక్షించాలని పిలుపునిస్తూ సోమవారం మొక్కలు నాటారు. మిషన్ అధ్యక్షుడు ప్రేమ్ మిర్పురి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం కూడా నిస్వార్థ సేవలో పవిత్రమైన అంశమని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్య హానికర ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. బాబా హర్దేవ్‌సింగ్ మహారాజ్ సందేశాన్ని ప్రతిబింబిస్తూ కాలుష్యం, అంతర్గతంగా లేదా బాహ్యంగా హానికరమనే సందేశాన్ని నిరంకారీ మిషన్ ద్వారా యావత్ దేశంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మానవాళి రక్షణకు చెట్లు నాటడం చాలా అవసరమన్నారు.



దుర్గాగణపతి నిజరూపం



సీతంపేటలో నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన దుర్గాగణపతి ఆలయం

# విజయ వినాయక



లక్ష్మీగణపతి అలంకారంలో దుర్గాగణపతి

## నగరంలో ప్రసిద్ధి చెందిన దుర్గాగణపతి పూజలకు సర్వం సిద్ధం

- సీతంపేటలో నవరాత్రి మహోత్సవాలకు ముస్తాబైన ఆలయం
- ఏటా తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహణ
- తమిళనాడు కళాకారులచే రోజుకో అలంకారంలో స్వామి దర్శనం

**రోజుకొక అలంకారంలో..**

**భాద్రపద మాసంలో వచ్చే వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రోజుకొక** అలంకారంలో దుర్గాగణపతి భక్తులకు దర్శనమివ్వడం ఆనవాయితీగా వస్తోంది. నగరంలోని ఆశీలుమెట్ట వద్ద ఉన్న సంపత్ వినాయక ఆలయం తరహాలో ప్రతి ఏటా ఇక్కడ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. తమిళనాడు కళాకారులచే దుర్గాగణపతిని తొమ్మిది రోజులు అలంకరించి రోజుకొక రూపంలో భక్తులకు దర్శనం కల్పిస్తుంటారు.

సీతంపేట: దేవదాయ శాఖ పరిధిలోని సీతంపేటలో కొలువైన దుర్గాగణపతి ఆలయం నగరంలో ప్రసిద్ధమైనదిగా గుర్తింపు పొందింది. భక్తుల కోరికలు, తలపెట్టిన కార్యాలు విఘ్నం లేకుండా నెరవేరుతాయని స్థానికుల విశ్వాసం. దుర్గాగణపతిని పూజిస్తే విజయం సిద్ధిస్తుందని ప్రగాఢమైన నమ్మకం. ఈ నెల 27 నుంచి జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. విద్యుత్ దీపాలంకరణ, విశేష పూజా కార్యక్రమాలు, గణపతి హోమాలు, సహస్ర నామార్చన, మహా అభిషేకాలు, విశేష అలంకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి దేవదాయ శాఖ, ఉత్సవ సేవా కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది.

**ఆలయ చరిత్ర.. విశిష్టత**

1980లో సీతంపేట కూడలిలోని ఖాళీ స్థలంలో స్థానిక యువత ఆధ్వర్యంలో విఘ్నేశ్వరా యువజన సేవా సంఘం ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో యువత క్యారమ్స్ వంటి ఆటలు ఆడేవారు. భాద్రపద మాసంలో మాత్రం ఆ స్థలంలో మట్టి వినాయక విగ్రహాన్ని పెట్టిన వరాత్రి ఉత్సవాలు నిర్వహించేవారు. మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, పందిరి నిర్మించడం శ్రమతో కూడుకున్నది కావడంతో సంఘ ప్రతినిధులు ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. అదే తలంపుతో 1992లో శంకుస్థాపన చేశారు. తంజావూరు నుంచి దుర్గాగణపతి విగ్రహాన్ని తెచ్చి, 1993లో వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపిస్తున్నారు. ఈ నెల 16న దుర్గాగణపతి ఆలయ 33వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం, వినాయక చవితి రోజున దుర్గాగణపతి వెండి కవచం అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. అదే సంప్రదాయం నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఆలయం దినాదినాభివృద్ధి చెందడంతో భక్తుల సంఖ్యపెరిగింది. గుడి ఆదాయం కూడా పెరగడంతో 2009లో దేవదాయ శాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి దేవదాయ శాఖ పరిధిలో ఆలయ నిర్వహణ, ఉత్సవాల పర్యవేక్షణ జరుగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వార్డు కార్పొరేటర్‌గా గెలుపొందిన సారిపిల్లి గోవింద్ చొరవతో సొంత నిధులు, దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షలతో 2022లో ఆలయాన్ని శిల్పకళాకృతులతో అందంగా తీర్చిదిద్ది మహాసంప్రోక్షణ గావించారు.

**దేవదాయ శాఖ ఆధ్వర్యంలో..**

ప్రతి ఏటా దేవదాయ శాఖ, వార్డు కార్పొరేటర్, ఉత్సవ సేవా కమిటీ సమన్వయంతో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల చివరి రోజున సిద్ధి, బుద్ధి సమేతంగా దుర్గాగణపతి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన పల్లకీపై పురవీధుల్లో ఊరేగించడం సంప్రదాయంగా కొనసాగుతూ వస్తోంది. ఈ ఊరేగింపులో పల్లకీ మోసిన వారికి శుభం జరుగుతుందని స్థానికుల విశ్వాసం. దీంతో పల్లకీ మోయడానికి యువత పోటీ పడుతుంటారు.

**9 రోజులు.. వివిధ అలంకారాలు**

ఈ నెల 27న వెండి కవచంలో దుర్గాగణపతి నిజరూప దర్శనం

| | |
|---|---|
| 28న | వాణీ గణపతి |
| 29న | లక్ష్మీ గణపతి |
| 30న | విష్ణు గణపతి |
| 31న | ఆదిత్య గణపతి |
| సెప్టెంబర్ 1న | శివబాల గణపతి |
| 2న | స్కంద గణపతి |
| 3న | త్రిముఖ గణపతి, |
| 4న | అర్ధనారీశ్వర గణపతి అలంకారం |

5వ తేదీ సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవమూర్తుల ఊరేగింపు

10వ తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నప్రసాద వితరణ

**అంగరంగ వైభవంగా ఉత్సవాలు**

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా దుర్గాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. ఏడుగురు సభ్యులతో ఉత్సవ సేవా కమిటీ వేశాం. ప్రతి రోజూ ఉదయం గణపతి హోమం, మహాభిషేకం, సహస్రనామార్చన జరుగుతాయి. సాయంత్రం భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. భక్తుల కోసం బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రూ.300 చెల్లించి తొమ్మిది రోజులు భక్తులు తమ గోత్ర నామాలతో సహస్ర నామార్చన చేయించుకోవచ్చు.

– జి.వి.రమాభాయి, ఆలయ ఈవో

## నేత్రదానం.. మహాదానం



జ్యోతి ప్రజ్వలన చేసి నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు రామాటాకీస్ రోడ్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాలలో జరగనున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం చాలా గొప్ప విషయమని, దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ 15 రోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ ఎ.వి.రమణ, డాక్టర్ మాధవి, ఆర్ఎంవో నవీన్‌కుమార్, పోస్ట్‌గ్రాడ్యుయేట్స్, పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్, ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరీలో విష్ణుభట్ల సిస్టర్స్

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ వార్షిక ఉత్సవాల్లో భాగంగా కళాభారతిలో మూడో రోజు సోమవారం విజయవాడకు చెందిన విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర సంగీత కచేరీ శ్రావ్యానందకరంగా సాగింది. వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా క్రిష్ణ ప్రసాద్, పిల్ల రమణమూర్తి, విష్ణుభట్ల సిస్టర్స్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విష్ణుభట్ల సిస్టర్స్ సంగీత కచేరీతో ప్రేక్షకులను మైమరిపించారు. ఈ కచేరీకి వయోలిన్‌పై డాక్టర్ మావుదూరి సత్యనారాయణ శర్మ, మృదంగంపై ప్రసాద్, ఘటంపై హరిబాబు సహకారం అందించారు.

## ఎర్రజెండా రెపరెపలు



గోపాలపట్నం ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డు ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. కార్మికుల నినాదాలతో హోరెత్తింది. సీఐటీయూ 11వ జిల్లా మహాసభలు పురస్కరించుకుని సోమవారం సాయంత్రం గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 93 మున్సిపాలిటీల్లో సీఐటీయూ ప్రధాన యూనియన్‌గా ఉందన్నారు. సీటూ నాయకుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ విలీన పంచాయతీ కార్మికులకు మినిమం టైమ్ స్కేల్ తీసుకు రావాలని హైకోర్టు ఆదేశాలిచ్చిందని తెలిపారు. గతంలో సాధించిన విజయాలు, పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు టి. నూకరాజు, జిల్లా కార్యదర్శి ఆర్‌కే ఎస్‌వీ కుమార్, ఉరుకూటి రాజు, ఎస్. రమణ, జోన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న మండపాలు



శ్రీనివాసనగర్‌లో ఆకట్టుకుంటున్న వినాయక మండపం



తుది మెరుగులు దిద్దుకుంటున్న యుద్ధ హెలికాప్టర్ నమూనా మండపం

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్‌ఏడీ పరిసరాల్లో వినాయక మండపాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కొందరు సంప్రదాయ నమూనాలతో మండపాలు నిర్మిస్తుంటే మరి కొందరు ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో నిర్మిస్తున్నారు. జీవీఎంసీ 91వ వార్డు శ్రీనివాసనగర్‌లో స్థానిక కమిటీ సభ్యులు వేసిన సాంప్రదాయ సెట్ ఆకట్టుకుంటోంది. అలాగే జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో ఆపరేషన్ సిందూర్ పేరుతో యుద్ధ హెలీ కాప్టర్ నమూనాతో మండపాన్ని తయారు చేస్తున్నారు. ఈ హెలీ కాప్టర్ పై ఫ్యాను, వెనుక ఉన్న ఫ్యాన్ తిరిగే విధంగా వేస్తున్నారు.సైనికుడిగా వినాయకుడు పైలెట్‌గా మూషికాన్ని తయారు చేస్తున్నారు. ఇది చూపరులరె ఆలోచింపజేసేదిగా స్ఫూర్తి నిచ్చేదిగా తయారవుతుందని చెబుతున్నారు.

## లలితా పీఠంలో త్రిరాత్రి గణపతి ఉత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఈ నెల 27 నుంచి 29 వరకు త్రిరాత్రి గణపతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠంలోని మణిద్వీపంలో కొలువైన విజయ గణపతికి 27న ఉదయం 6 గంటలకు విశేష పంచామృతాభిషేకం, వినాయక పూజ, కార్యసిద్ధి, ఋణ విమోచన కోసం సాయంత్రం 6.30 గంటలకు మహాగణపతి హోమం, భైరవ గణపతి హోమం జరుగుతాయని చెప్పారు. 28న సాయంత్రం 7 గంటలకు విజయాలను ప్రసాదించే వారాహి గణపతి హోమం, 29న సాయంత్రం 6.30 గంటలకు వివాహ సిద్ధికి హరిద్ర గణపతి హోమం నిర్వహిస్తామన్నారు. వీటిలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం ఉదయం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

## మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో వాకింగ్‌కు వెళ్లిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని పారిపోయారు. ఆరిలోవ క్రైం ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఆదర్శనగర్‌కు చెందిన కృష్ణవేణి (49) కీళ్ల నొప్పులు కారణంగా వైద్యుల సూచనల మేరకు రోజూ వాకింగ్ చేస్తున్నారు. ఆమె రోజూ మాదిరిగా సోమవారం ఉదయం ఆదర్శనగర్ నుంచి విమ్స్ ప్రాంగణం వరకు వాకింగ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తున్న సమయంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

## మట్టి విగ్రహాలకు భలే గిరాకీ



నరసింహనగర్ రైతుబజార్ వద్ద మట్టి విగ్రహాల విక్రయ స్టాల్



శంకరమఠం రోడ్డులో విక్రయిస్తున్న కోల్‌కతా మట్టి వినాయక ప్రతిమలు

సీతంపేట: పర్యావరణ పరిరక్షణపై సామాజిక స్పృహ వెల్లివిరిసింది. వినాయక చవితి సందర్భంగా బజార్లలో ఎక్కడ చూసినా మట్టి ప్రతిమల అమ్మకాలతో సందడి నెలకొంది. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను పూజించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీవీఎంసీ, సామాజిక స్వచ్ఛంద సంస్థలు చేసిన ప్రచారం ఫలిచింది. కోల్‌కతా నుంచి ప్రత్యేకంగా రప్పించిన మట్టి వినాయక విగ్రహాలను ప్రధాన రహదారులు, కూడళ్లలో స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, నరసింహనగర్ రైతుబజార్ వద్ద ప్రతిమలు విక్రయిస్తున్నారు. రూ.60 నుంచి రూ.7 వేల వరకు వివిధ సైజుల్లో ఆకర్షణీయంగా మట్టి విగ్రహాలు లభిస్తున్నాయి. గంగానది మట్టితో తయారు చేసిన ప్రతిమలను కోల్‌కతా నుంచి రప్పించామని వ్యాపారులు చెబుతున్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి, ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో సోమవారం స్వాతి ప్రమోటర్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. స్వాతి ప్రమోటర్స్ అధినేత కృష్ణారెడ్డి చేతుల మీదుగా భక్తులకు విగ్రహాలను అందజేశారు. పర్యావరణాన్ని పరిరక్షించే మట్టి గణపయ్యలనే పూజించాలని భక్తులకు కృష్ణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ ఏజీఎం సంతోష్‌కుమార్, సిబ్బంది, ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**మట్టి ప్రతిమల పంపిణీ**

మురళీనగర్: పర్యావరణ హితంగా వినాయక చవితి జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ ఇంజినీర్ శ్రీరామ్‌నాయుడు పిలుపునిచ్చారు. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంట్లో మట్టి వినాయకుడిని పూజించి చిన్న పాత్రలో నీటితో నిమజ్జనం చేయాలని సూచించారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 200 మందికి మట్టి వినాయకులు, వ్రతకల్పం పుస్తకాలను ఆయన అందించారు. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఎలెక్ట్ గవర్నర్ ఆర్ఆర్ మహేష్, క్లబ్ కార్యదర్శి పి.కమల, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ కె.సుగుణ, కె.కృష్ణవేణి, ఎం.మహాలక్ష్మి, ఎస్.పూర్ణిమ, పి.లక్ష్మీకుమారి, జమున, జంటకాలనీల వాసులు పాల్గొన్నారు.



మట్టి ప్రతిమ అందిస్తున్న శ్రీరామ్ నాయుడు

### తాగునీటికి తంటాలు



కంచరపాలెం పైడిమాంబ కాలనీలో తాగునీటి కష్టాలు కన్నీరు పెట్టిస్తున్నారు. కాలనీ మొత్తానికి రెండే కుళాయి ట్యాప్‌లు ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి కుళాయి పక్కనే డ్రైనేజీ, మురుగు కాలువ ఉండటంతో నీరు పట్టి తీసుకెళ్లేందుకు మహిళలు తంటాలు పడుతున్నారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com